సాక్షి
విశాఖపట్నం
శుక్రవారం । 16 । ఫిబ్రవరి । 2024



టెన్త్, ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు

పది, ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో **పని చేయాలని జేసీ ఆదేశించారు.** 8లో



చోరీ నిందితులకు రిమాండ్

హెచ్‌పీసీఎల్‌లో ఎక్స్ఛేంజ్ ట్యూబ్ స్క్రాప్ చోరీకి పాల్పడిన నిందితులను గురువారం రిమాండ్‌కు తరలించారు. 8లో



దివ్యాంగుల జీవితాల్లో వెలుగులే లక్ష్యం

8లో

వలంటీర్లకు సెల్యూట్

- ప్రభుత్వంలో సచివాలయ వ్యవస్థ కీలకం
- వలంటీర్లు దేశానికే ఆదర్శం
- సేవా పురస్కారాలు అందజేసిన మంత్రి అమర్‌నాథ్



సేవా వజ్ర అందుకున్న వలంటీర్లతో మంత్రి అమర్‌నాథ్, మేయర్ హరివెంకట కుమారి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కేకే రాజు, డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కట్టుమూరి సతీష్, యువజన విభాగం రీజనల్ అధ్యక్షుడు శివనందీష్

డాబాగార్డెన్స్: దేశంలోని అన్ని రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్‌లోని వలంటీర్ వ్యవస్థ ఆసక్తి కనబరుస్తున్నాయని రాష్ట్ర ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. చాలా రాష్ట్రాలు వలంటీర్ వ్యవస్థలను నడిపేందుకు ఆలోచన చేస్తున్నాయన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను జగన్‌మోహన్‌రెడ్డి తన పాదయాత్రలో గుర్తించి, గ్రామస్వరాజ్యం తీసుకొచ్చేందుకు 2019లో వలంటీర్ వ్యవస్థకు సీఎం హోదాలో శ్రీకారం చుట్టారన్నారు. నాటి నుంచి నేటి వరకు వార్డు వలంటీర్లు నిస్వార్థంతో సేవలు అందిస్తున్నారన్నారు. వారి అంకితభావానికి గుర్తింపుగా సేవా మిత్ర, సేవారత్న, సేవా వజ్ర పురస్కారాలను ప్రభుత్వం ఏటా అందిస్తోందన్నారు. గురువారం సిరిపురంలోని వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో వలంటీర్లకు పురస్కారాలను మేయర్ హరివెంకటకుమారి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, కలెక్టర్ మల్లికార్జున, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కేకే రాజు, డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కట్టుమూరి సతీష్, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, అదనపు కమిషనర్ కేఎస్ విశ్వనాథన్‌తో కలిసి పురస్కారాలను అందజేశారు. గుంటూరు జిల్లా ఫిరంగిపురంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్లకు పురస్కారాలు అందజేసిన కార్యక్రమాన్ని లైవ్‌లో చూపించారు. అనంతరం 32 మంది వలంటీర్లను సేవా వజ్ర, 115 మంది వలంటీర్లకు సేవా రత్న, 10,670 మందికి సేవా మిత్ర అవార్డులతో సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి అమర్‌నాథ్ మాట్లాడుతూ నాలుగేళ్లుగా నిస్వార్థతంతో నిజాయతీగా సేవలందిస్తున్న వలంటీర్లను ప్రోత్సహిస్తూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అవార్డులు అందజేయడం అభినందనీయమన్నారు. కోవిడ్ వంటి కష్టకాలంలో కూడా వలంటీర్లు చేసిన సేవలు ఎప్పటికీ మర్చిపోలేమన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత విప్లవాత్మక నిర్ణయాల్లో వలంటీర్ వ్యవస్థ ఒకటని, ఈ తరహాలో దేశంలో ఏ రాష్ట్రం కూడా ఆలోచన చేయలేకపోయాయని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలన్నీ నేరుగా వలంటీర్లు ద్వారానే అందుతున్నాయని తెలిపారు. నగర మేయర్ హరి వెంకటకుమారి మాట్లాడుతూ రాష్ట్రానికి పట్టుకొమ్మలు వలంటీర్లేనని తెలిపారు. నిస్వార్థంగా సేవలందిస్తున్న వలంటీర్లను మేయర్ అభినందించారు. జగనన్నకు ప్రజా ప్రతినిధుల కన్నా వలంటీర్లే ఎక్కువని, వారిపై అమితమైన ప్రేమ ఉందన్నారు. త్వరలోనే వలంటీర్లకు ముఖ్యమంత్రి మరింత న్యాయం చేస్తారన్నారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి దృష్టిలో మీరు మానస పుత్రికలు..పుత్రులని వలంటీర్లనుద్దేశించి పేర్కొన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం వల్లే వలంటీర్, సచివాలయ వ్యవస్థ వచ్చిందన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. వలంటీర్ వ్యవస్థతో పథకాలన్నీ నిజాయతీగా ప్రజలకు అందుతుంటే అది చూసి ఓర్వలేక చంద్రబాబు, పవన్ కల్యాణ్ చేస్తున్న విమర్శలు పట్టించుకోవద్దన్నారు. డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కట్టుమూరి సతీష్, మాట్లాడారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రీజినల్ అధ్యక్షుడు శివనందీష్, పలువురు అధికారులు, అధిక సంఖ్యలో వలంటీర్లు పాల్గొన్నారు.



సేవా వజ్ర అవార్డు పొందిన వలంటీర్లు సత్యవతి,వెంకటరమణకు ప్రోత్సాహకాలను అందజేస్తున్న మంత్రి అమర్‌నాథ్, మేయర్ హరివెంకటకుమారి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి, ఎమ్మెల్సీ కల్యాణి, ఉత్తర సమన్వయకర్త కేకే రాజు

రెండో సారి సేవా వజ్ర



నిస్వార్థంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలు నేరుగా లబ్ధిదారులకు అందించేందుకు నా వంతు కృషి చేస్తున్నా. నా సేవలు గుర్తించారు. సేవా వజ్ర అందుకోవడం ఇది రెండోసారి. చాలా ఆనందంగా ఉంది. ముఖ్యమంత్రి మా లాంటి వారికి ఉపాధి కన్నా సేవ చేసే భాగ్యం కల్పించారు. ప్రజాసేవకు గాను సేవా వజ్ర అవార్డుతో ప్రోత్సహించడం చాలా సంతోషంగా ఉంది.


– టి.శాంతి,
254 సచివాలయం, తాటిచెట్లపాలెం

థాంక్యూ సీఎం సార్



రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలు లబ్ధిదారులకు చేరవేయడంలో చేస్తున్న కృషికి 2023లో సేవారత్నతో సత్కరించారు. ఈ ఏడాది సేవా వజ్ర అవార్డుతో ప్రోత్సహించడం చాలా సంతోషంగా ఉంది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాలాంటి వారిని గుర్తించడం..సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర అవార్డులతో ప్రోత్సహించడం బాగుంది. వలంటీర్ల తరపున ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు.

–తాడిచెట్టి రోజా,
శ్రీకాంత్‌నగర్–8 సచివాలయం, జోన్–2



దొంగే.. దొంగ ఓటర్లంటూ..!

- రెండేసి ఓట్లు నమోదు చేసుకున్నది టీడీపీ అనుచరులే..
- రెండు వార్డుల్లో ఓటు నమోదు చేసుకున్న తెలుగు యువత నేత
- 55వ వార్డులోని 27,49 బూత్‌లలో టీడీపీ వార్డు అధ్యక్షుడికి ఓటు హక్కు
- ప్రతి నియోజకవర్గంలోనూ ఇదే తరహాలో డబుల్ ఎంట్రీలు
- వాటిని తొలగించే ప్రయత్నాలు చేస్తుంటే ఫిర్యాదులతో బురద జల్లే ప్రయత్నాలు

సాక్షి, విశాఖపట్నం : సర్వేలన్నీ సింగిల్ సైడ్ రావడం.. ప్రజలంతా మరోసారి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి 'ఫ్యాన్'గా మారాలని భావిస్తుంటే.. ఏం చెయ్యాలో పాలుపోని టీడీపీ.. 2019లో గెలిచేందుకు తొక్కిన అడ్డదారుల్నే మళ్లీ అనుసరిస్తోంది. అక్రమాలు చేసైనా సరే.. ఎలాగైనా ఎన్నికల్లో గెలిచి తీరాలన్న దుర్బుద్ధితో ప్రతి నియోజకవర్గంలోనూ దొంగ ఓట్లను నమోదు చేసుకున్నారు. చివరి వడపోతలో వీరి పన్నాగానికి బ్రేకులు పడుతుండటంతో.. దొంగే.. దొంగా దొంగా అని అరచినట్లుగా.. ప్రభుత్వమే దొంగ ఓట్లు నమోదు చేసుకుందంటూ బురద జల్లేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. అడ్డగోలు వ్యాఖ్యలు.. అర్థంపర్థంలేని ఫిర్యాదులు చేస్తున్నారు. కానీ టీడీపీ నేతలే అసలు దొంగలన్న నిజాలు ఒక్కొక్కటిగా బయటికి వస్తున్నాయి.

మరోసారి ఓటమి భయంతో ఏం చేయాలో పాలుపోక అధికారులపై అడ్డగోలు ఫిర్యాదులు.. ఎల్లో మీడియా అండతో పచ్చి అబద్ధాల రాతలతో రోత పుట్టిస్తున్నారు తెలుగుదేశం పార్టీ నేతలు. ఈ ఎన్నికల్లో ఎలాంటి దొంగ ఓట్లకు ఆస్కారం లేకుండా.. పారదర్శకంగా వ్యవహరిస్తూ ఏ ఒక్కటి డూప్లికేట్ ఓటు లేకుండా ప్రభుత్వంతో పాటు ఎన్నికల కమిషన్ చర్యలకు ఉపక్రమించింది. ఈ నేపథ్యంలోనే వలస వెళ్లిపోయిన వారి ఓట్లు, మృతి చెందిన వారి ఓట్లు, డూప్లికేట్ ఓట్లను తొలగిస్తోంది. అయితే ఈసారి గెలవకపోతే పార్టీ మనుగడ కష్టమని స్పష్టమవడంతో తమ దొంగ ఓట్లు కాపాడుకునేందుకు టీడీపీ నేతలు విష ప్రచారానికి తెరతీశారు. ప్రతి నియోజకవర్గంలో వేల మంది ఓట్లను తొలగించేస్తున్నారంటూ పచ్చపత్రికల సహకారంతో హడావుడి చేసేస్తున్నారు. అయితే తొలగించిన ఓట్ల వివరాలు, ఎందుకు తొలగించాల్సి వస్తోందన్న వివరాలను సహేతుకంగా వివరిస్తూ ఎన్నికల కమిషన్‌కు జిల్లా అధికార యంత్రాంగం ఎప్పటికప్పుడు నివేదిక సమర్పిస్తోంది. ఓట్ల తొలగింపు సక్రమంగానే సాగిందని రాష్ట్ర ఎన్నికల కమిషన్ సైతం స్పష్టం చేసింది. చివరికి సుప్రీంకోర్టు కూడా కితాబిచ్చింది. తుది జాబితా విడుదలైన తర్వాత కూడా ఓటర్ల జాబితా మదింపు ప్రక్రియ చేపడుతున్న సమయంలో టీడీపీ నేతల దొంగ ఓట్ల బాగోతాలు ఒక్కొక్కటిగా బట్టబయలవుతున్నాయి.

రెండు చోట్ల ఓట్లు నమోదు చేసుకున్న తెలుగు తమ్ముళ్లు

నారా లోకేష్ అనుచర గణంలో ఒకరు.. తెలుగు యువత జనరల్ సెక్రటరీగా వ్యవహరిస్తున్న రంజిత్‌కుమార్ కూడా రెండు చోట్ల ఓటు నమోదు చేసుకున్నారు. పశ్చిమ నియోజకవర్గంలో 56వ వార్డులో రంజిత్ బండి పేరుతో.. ఉత్తర నియోజకవర్గంలోని 55వ వార్డులో రంజిత్‌కుమార్ బండి పేరుతో రెండు చోట్ల ఓటు హక్కు దక్కించుకున్నారు. అదే విధంగా మరో టీడీపీ చోటా నేత బింగి రాజు రెడ్డి సైతం 56, 55వ వార్డుల్లో ఓటు హక్కు నమోదు చేసుకున్నారు. అదేవిధంగా టీడీపీ కార్యకర్తలకు భీమిలి నియోజకవర్గంలోని మంగమూరిపేట, ఉప్పాడలో బూత్ నంబర్ 55, 65లో రెండేసి ఓట్లు ఉన్నాయి. ఈసారి ఎలాగైన ఎన్నికల్లో గెలిచేందుకు సృష్టించిన దొంగ ఓట్ల జాబితాలో ఇవి కేవలం మచ్చుకు కొన్ని ఉదాహరణలు మాత్రమేనని చెప్పుకోవచ్చు. ప్రతి నియోజకవర్గంలోనూ పచ్చ నేతలు తమకు నచ్చినట్లుగా దొంగ ఓట్లు నమోదు చేయించేశారు. ఇప్పుడు ఇంటింటా పరిశీలనలో కొన్ని ఓట్లు తొలగించేశారు. అయితే.. ఓటు హక్కు నమోదుకు ఇంకా సమయం ఉండటంతో.. ఇప్పటికే ఒక చోట ఓటు ఉన్నా.. మళ్లీ మరో నియోజకవర్గంలో ఓటు హక్కు పొందేందుకు టీడీపీ బ్యాచ్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. ఇవన్నీ అధికారుల పరిశీలనల్లో బయటపడుతుంటే.. ఏం చెయ్యాలో తెలీక.. ప్రభుత్వంపై దొంగలే బురద జల్లేందుకు ప్రయత్నిస్తుండటం కొసమెరుపు.

న్యూస్‌రీల్

ఉక్కు ఎల్‌డీ కన్వర్టర్ రికార్డ్ లైనింగ్ లైఫ్



ఎస్ఎంఎస్–2 విభాగంలో కేక్ కట్ చేస్తున్న డైరెక్టర్, ఉద్యోగులు

ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ స్టీల్ మెల్ట్ షాప్–2కు చెంది ఎల్‌డీ–డీ కన్వర్టర్ గురువారం 10 వేల హీట్‌ల రికార్డ్ లైనింగ్ లైఫ్ సాధించింది. విశాఖ ఉక్కు కర్మాగారంలో ఏ కన్వర్టర్‌కైనా అత్యుత్తమ ప్రదర్శన ఇదే.. 2019 జూలైలో స్టీల్ మెల్ట్ షాప్–1 కన్వర్టర్–ఎలో 7847 హీట్‌లతో అత్యుత్తమ లైనింగ్ లైఫ్ కాగా ఇప్పుడు ఈ కన్వర్టర్ వాటిని అధిగమించి రికార్డు నమోదు చేసింది. ఈ సందర్భంగా గురువారం విభాగానికి చెందిన కనిష్ఠ అధికారి విజయ్ సింగ్ మీనాతో కలిసి డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎ.కె. బాగ్చీ కేక్ కట్ చేశారు. రికార్డు నమోదు చేయడం పట్ల సీఎండీ అతుల్ భట్, డైరెక్టర్ బాగ్చీలు విభాగం సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో సీజీఎం (వర్క్స్) ఎ.కె. సోబ్తీతో పాటు విభాగం ఉన్నతాధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం



సచివాలయాలను తనిఖీ చేస్తున్న జేసీ మయూర్ అశోక్

మహారాణిపేట: వార్డు సచివాలయాల్లో పేదలందరికీ ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను జిల్లా జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్ పరిశీలించారు. గురువారం తాడిచెట్లపాలెం, నర్సింహనగర్ వార్డు సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ జరుగుతున్న ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు, సచివాలయ సిబ్బందికి పలు మార్గదర్శకాలు జారీ చేశారు. అనంతరం అక్కడకు వచ్చిన కొంతమంది లబ్ధిదారులతో జేసీ మాట్లాడారు. ఆయన వెంట జోనల్ కమిషనర్, సీతమ్మధార తహసీల్దార్, ఇతర అధికారులు ఉన్నారు.

శారదాపీఠంలో ఆధ్యాత్మిక సౌరభం

ఘనంగా ప్రారంభమైన వార్షికోత్సవాలు



మేధా దక్షిణామూర్తికి పూజలు చేస్తున్న స్వామీజీలు



భక్తులకు ఆశీసులు అందిస్తున్న స్వామీజీ



కచేరీలో పాల్గొన్న కళాకారులు

పెందుర్తి: జగన్మాత శారదా సన్నిధిలో ఆధ్యాత్మికత పరవళ్లు తొక్కుతోంది. వేదఘోషతో సాగరతీరం పరవశిస్తోంది. పెందుర్తి మండలం చినముషిడివాడలోని శ్రీశారదాపీఠం వార్షికోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు గురువారం యజ్ఞయాగాదులు దిగ్విజయంగా జరిగాయి. వైదిక ఆచారాల మధ్య గణపతి పూజతో ఉత్సవాలకు అంకురార్పణ జరిగింది. పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామీజీ, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామీజీ పీఠం అనుష్ఠాన దేవత శారదా స్వరూప రాజశ్యామల అమ్మవారికి, మేధా దక్షిణామూర్తికి ప్రత్యేక పూజలు ఆచరించారు. గోమాతకు పూజ చేసి నైవేద్యం అందించారు. జమ్మిచెట్టు ప్రదక్షిణ చేశారు. అనంతరం పారాయణ మహాయజ్ఞంలో భాగంగా భక్త బృందాలు, భజన మండళ్ల కనకధార స్తోత్రాన్ని పారాయణ చేశాయి. ఐదు రోజుల పాటు జరిగే మహారుద్ర సహిత రాజశ్యామల యాగాన్ని పండితోత్తముల సమక్షంలో అగ్నిమథనం చేసి ప్రారంభించారు. ప్రజా శ్రేయస్సును కాంక్షిస్తూ లక్ష్మీ గణపతి, దక్షిణామూర్తి హోమాలు చేపట్టారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా సామూహిక గాత్ర కచేరీ చేపట్టారు. కళాకారులు ఉత్సాహంగా భక్తి గీతాలను ఆలపించారు.

నేడు శ్రీశైలం దేవస్థానం సారథ్యంలో మల్లికార్జున కల్యాణం

పీఠం వార్షికోత్సవాల్లో భాగంగా శ్రీశైలం దేవస్థానం సారథ్యంలో శుక్రవారం భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్ల కల్యాణాన్ని నిర్వహించనున్నారు. సాయంత్రం 6 గంటలకు ఈ వేడుక శాస్త్రోక్తంగా ప్రారంభమవుతుంది. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో శనివారం శ్రీనివాస కల్యాణం, ఆదివారం వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం నిర్వహించనున్నారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అనుబంధ విభాగాల కమిటీల నియామకం

సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల కమిటీలను నియమించారు. ఈమేరకు గురువారం కేంద్ర పార్టీ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర న్యాయ విభాగ కమిటీ వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్.కాళిదాస్‌రెడ్డి (విశాఖ), రాష్ట్ర అధికార ప్రతినిధిగా పాకా సత్యనారాయణ (విశాఖ), సెక్రెటరీలుగా జి.రోశిరెడ్డి (విశాఖ), మోస్య బుజ్జిబాబు (అల్లూరి), వి.శ్రీనివాసరావు (విశాఖ), యర్రా శ్రీనివాసరావు (అనకాపల్లి), జాయింట్ సెక్రెటరీలుగా గండేపల్లి త్రినాథ్‌మూర్తి (విశాఖ), గాలి రామిరెడ్డి (విశాఖ), పంపన సత్యబాబు (అనకాపల్లి) నియమితులయ్యారు. రాష్ట్ర ఎస్టీ సెల్ విభాగం ప్రెసిడెంట్‌గా మత్స్యరాస వెంకటలక్ష్మి (అల్లూరి), జోనల్ ఇన్‌చార్జి కిముడు శ్రీనివాస విశ్వప్రసాద్ నాయుడు (అల్లూరి), సెక్రెటరీలుగా ఎన్.ఆనంద బాబు (విశాఖ), గోవర్ధన్ గిరి (అనకాపల్లి), అసిర గోవింద్ (అనకాపల్లి), పండా రామకృష్ణ దొర (అల్లూరి), కిముడు త్రిమూర్తుల దొర (అనకాపల్లి), గబ్బాడి సన్యాసిదొర (అల్లూరి), వంతల బాబూరావు (అల్లూరి), జాయింట్ సెక్రెటరీలుగా జన్ని నరసింహమూర్తి (అల్లూరి), కిముడు శివ లక్ష్మి (అనకాపల్లి), మజ్జి జయవర్ధిని (అల్లూరి)లను, కురుడుబోయిన గంగరాజు (అల్లూరి), కూడా సురేష్‌కుమార్ (అల్లూరి), కిల్లు కోటిబాబు (అల్లూరి)లను నియమించారు. రాష్ట్ర వైఎస్సార్ సేవాదళ్ విభాగ కమిటీ జాయింట్ సెక్రెటరీలుగా గవర నాయుడు (విశాఖ), కుడినోయిన గంగరాజు (అల్లూరి), రాష్ట్ర సాంస్కృతిక విభాగ కమిటీ సెక్రెటరీలుగా బొండాడ వెంకట రమణ (విశాఖ), శోభ ధర్మయ్యదొర (అల్లూరి), సంపంగి శ్రీనివాసరావు (విశాఖ), జాయింట్ సెక్రెటరీగా కొండపు జగదీశ్వర రావు(విశాఖ)లు నియమితులయ్యారు.

ప్రైవేటులో ఉచిత సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

విశాఖ విద్య: ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లలో ఉచిత ప్రవేశాల కోసం అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో ఎల్. చంద్రకళ తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరంలో జిల్లాలోని ప్రైవేటు స్కూళ్లలో ఒకటో తరగతి ప్రవేశం పొందవచ్చన్నారు. ఇందుకోసమని ఈ నెల 23 నుంచి మార్చి 14 వరకు csc.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. జిల్లాలోని అన్ని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల వారు తమ స్కూల్ వివరాలను ఈ నెల 20 నాటికి వెబ్‌సైట్‌లో పొందుపరుచాలని ఆదేశించారు. సందేహాలు ఉన్నట్లెతై 9849245230, 6305538679 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

మిలాన్ ఏర్పాట్ల పరిశీలన

విశాఖ సిటీ: ప్రతిష్టాత్మక మిలాన్–2024 నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేసే పనిలో జిల్లా అధికార యంత్రాంగం నిమగ్నమైంది. ఈ నెల 19 నుంచి 27వ తేదీ వరకు రెండు ఫేజ్‌లలో బీచ్ రోడ్డులో ఈ కార్యక్రమం జరగనుంది. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ ఆదేశాల మేరకు పోలీస్, నేవీ, రెవెన్యూ, జీవీఎంసీ, ఇతర శాఖల ఉన్నతాధికారులు గురువారం మిలాన్ జరిగే ప్రదేశాలను సందర్శించి ఏర్పాట్లు జరుగుతున్న తీరును పరిశీలించారు. ప్రధాన స్టేజ్‌ప్లాన్ నుంచి బీచ్ రోడ్డులో భద్రత, వీక్షకుల గ్యాలరీ, బారికేడింగ్, ఇతర భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంలో జీవీఎంసీ కమిషనర్ సి.ఎం.సాయికాంత్ వర్మ, జాయింట్ సీపీ కె.ఫకీరప్ప, డీసీపీ–1 వి.ఎన్.మణికంఠ చందోలు, జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ కె.ఎస్ విశ్వనాథన్, డీసీపీ–2 ఎం.సత్తిబాబు, నేవీ ఉన్నతాధికారులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

పకడ్బందీగా టెన్త్, ఇంటర్ పరీక్షలు

- మార్చి 1 నుంచి 20 వరకు ఇంటర్
- 18 నుంచి 30 వరకు టెన్త్
- కేంద్రాల్లో విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలి
- సమన్వయంతో పరీక్షలను విజయవంతం చేయాలి
- జేసీ మయూర్ అశోక్



విశాఖ విద్య: జిల్లాలో జరగనున్న పదో తరగతి, ఇంటర్ పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులందరూ సమన్వయంతో పని చేయాలని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ ఆదేశించారు. గురువారం కలెక్టర్ కార్యాలయ వీడియో సమావేశ మందిరంలో పదో తరగతి, ఇంటర్ పరీక్షల నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో మార్చి 1 నుంచి 20వ తేదీ వరకు ఇంటర్మీడియట్ థియరీ, ప్రాక్టికల్ పరీక్షలు, మార్చి 18 నుంచి 30వ తేదీ వరకు 10వ తరగతి పరీక్షలు జరగనున్నాయని ఈ సందర్భంగా జేసీ పేర్కొన్నారు. 10వ తరగతి పరీక్షలకు మొత్తం 31,379 మంది హాజరవుతున్నారని, వారిలో రెగ్యులర్ విద్యార్థులు 28,367 మంది, ప్రైవేట్ విద్యార్థులు 3,012 మంది ఉన్నారని చెప్పారు. రెగ్యులర్ విద్యార్థుల్లో 14,972 మంది బాలురు, 13,294 మంది బాలికలు ఉన్నట్లు తెలిపారు. అలాగే ప్రథమ ఏడాది ఇంటర్మీడియట్ పరీక్షలకు 40,873 మంది విద్యార్థులు, ద్వితీయ ఏడాదికి 41,806 మంది విద్యార్థులు హాజరుకానున్నారని వివరించారు. జిల్లా వ్యాప్తంగా 138 పరీక్ష కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు జరగనుండగా, 93 కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు జరగనున్నట్లు చెప్పారు. 10వ తరగతి పరీక్షలు ప్రతి రోజు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు, ఇంటర్ పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయని వెల్లడించారు. పోలీస్ శాఖ ద్వారా పరీక్ష కేంద్రాల వద్ద గట్టి భద్రతా ఏర్పాట్లను చేయాలని, పరీక్షల సమయంలో 144 సెక్షన్ అమలు చేయాలని తెలిపారు. పరీక్షా కేంద్రాల సమీపంలో ఎక్కడా కూడా జిరాక్స్ కేంద్రాలు ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షా కేంద్రాలకు ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించకుండా చర్యలు చేపట్టాలన్నారు. వేసవి దృష్ట్యా వైద్య ఆరోగ్య శాఖ ద్వారా పరీక్షా కేంద్రాలలో వైద్య సిబ్బందిని నియమించి, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులు అందుబాటులో ఉంచాలన్నారు. పరీక్షల సమయంలో నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని ఆ శాఖ అధికారులకు సూచించారు. విద్యార్థుల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో డీఈవో ఎల్. చంద్రకళ, ఆర్.ఐ.వో. పి.మురళీధర్, డీవైఈవో బి.రాధ, పోలీస్, జీవీఎంసీ, వైద్యారోగ్య, తపాలా, విద్యుత్, రవాణా, ఏపీఎస్ ఆర్టీసీ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలు	
రాసే విద్యార్థులు	: 31,379 మంది
రెగ్యులర్ విద్యార్థులు	: 28,367 మంది
ప్రైవేట్ విద్యార్థులు	: 3,012 మంది
మొత్తం పరీక్ష కేంద్రాలు	: 138
పరీక్షా సమయం	: ఉదయం 9.30 - 12.45 గంటల వరకు

ఇంటర్ ప్రథమ సంవత్సరం	
పరీక్షలు రాసే విద్యార్థులు	: 40,873 మంది
ద్వితీయ సంవత్సరం	: 41,806 మంది
మొత్తం పరీక్ష కేంద్రాలు	: 93
పరీక్షా సమయం	: ఉదయం 9 - 12 గంటల వరకు..

'నర్సుల పోస్టులు భర్తీ చేయడం లేదు'

మహారాణిపేట: ఆంధ్ర వైద్య కళాశాల(ఏఎంసీ)లో స్టాఫ్‌నర్సు పోస్టులకు సంబంధించి ఎటువంటి నియామక ప్రక్రియ చేపట్టడం లేదని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు ఒక ప్రకటనలో తెలిపారు. స్టాఫ్‌నర్సుల పోస్టుల కోసం ఎలాంటి దరఖాస్తులు స్వీకరించడం లేదన్నారు. నర్సుల పోస్టులకు సంబంధించి వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ డైరెక్టర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

పలు రైళ్ల రీ షెడ్యూల్

తాటిచెట్లపాలెం: ఆయా స్టేషన్ల నుంచి గురువారం బయల్దేరాల్సిన పలు రైళ్లను రీషెడ్యూల్ చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. లింక్ రైళ్ల ఆలస్యంగా నడుస్తున్నందున ఈ రైళ్ల రీషెడ్యూల్ చేశామని, అంతే ఆలస్యంగా ఈ రైళ్ల పలు స్టేషన్లకు చేరుకుంటాయని పేర్కొన్నారు.

- గురువారం ఉదయం 8.50 గంటలకు బయల్దేరవలసిన బెంగళూరు–హతియా(12836) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఉదయం 10 గంటలకు బయల్దేరింది.
- గురువారం ఉదయం 9.10 గంటలకు డిబ్రూగఢ్‌లో బయల్దేరవలసిన డిబ్రూగఢ్–సికింద్రాబాద్(07047) స్పెషల్ ఉదయం 11.30 గంటలకు బయల్దేరింది.
- శుక్రవారం ఉదయం 10.15 గంటలకు బెంగళూరులో బయల్దేరవలసిన బెంగళూరు–అగర్తలా(12503) ఎక్స్‌ప్రెస్ సాయంత్రం 4 గంటలకు బయల్దేరనుంది.



భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలి



రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులతో జేసీ ఎం.మయూర్‌అశోక్, డీఈవో ఎల్.చంద్రకళ, తదితరులు

- జేసీ ఎం.మయూర్‌అశోక్
- ముగిసిన జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ మనక్

గాజువాక: విద్యార్థులు తమలోని ప్రతిభకు పదును పెట్టి భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలని జాయింట్ కలెక్టర్ ఎ.మయూర్ అశోక్ పిలుపునిచ్చారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ పర్యవేక్షణలో గాజువాక ఎస్ఎఫ్ఎస్ పాఠశాలలో గురువారం నిర్వహించిన జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ మనక్ జిల్లా స్థాయి పోటీల ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇన్‌స్పైర్ మనక్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. డీఈవో చంద్రకళ మాట్లాడుతూ ప్రాజెక్టుల నిర్వహణ ద్వారా విద్యార్థుల్లో పరిశీలనా దృక్పథాన్ని పెంపొందించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. సైన్స్, గణిత ఉపాధ్యాయులు తమ బోధనలో సృజనాత్మక కృత్యాలకు ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. పాఠశాలల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన డిజిటల్ బోధనోపకరణాలు ఇందుకు ఉపయోగపడుతున్నాయని చెప్పారు. ముందుగా జేసీ, డీఈవో విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులను పరిశీలించి వారిని అభినందించారు. అనంతరం విజేతలకు ప్రశంసాపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో డీవైఈవో ఎ.గౌరీ శంకర్, ఎస్ఎఫ్ఎస్ పాఠశాల ప్రిన్సిపాల్ రెవరెండ్ ఫాదర్ ఎం.జోజి, ఎంఈవోలు ఎం.సునీత, మధుమూర్తి, శ్రీనివాసరావు, విశ్వనాథం, రమణాజీ, పాల్గొన్నారు. జ్యూరీ మెంబర్లుగా విజ్ఞాన్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీనివాసనాయక్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.ధనలక్ష్మి, హెచ్‌వోడీ డాక్టర్ కె.గోవిందరావు, డాక్టర్ డి.రవికుమార్, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ నుంచి ప్రత్యేక పరిశీలకుడిగా డాక్టర్ దేవాన్స్, జిల్లా సైన్స్ అధికారి కప్పల ప్రసాద్ పాల్గొన్నారు.

204 ప్రాజెక్టుల నమోదు

జిల్లా వ్యాప్తంగా వివిధ పాఠశాలల నుంచి 204 ప్రాజెక్టులు నమోదు కాగా.. 64 ప్రాజెక్టులను ఉత్తమమైనవిగా ఎంపిక చేశారు. వీటిలో 10 శాతం ప్రాజెక్టులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. వివిధ పాఠశాల నుంచి 400 మంది విద్యార్థులు ప్రాజెక్టులను తిలకించారు. మింది, గాజువాక, నడుపూరు, స్థానిక ఎస్ఎఫ్ఎస్ పాఠశాల, బాపూజీ పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

పర్యావరణ పరిరక్షణకు ఎన్టీపీసీ కృషి



మీడియాతో మాట్లాడుతున్న సింహాద్రి ఎన్టీపీసీ ప్రాజెక్టు హెడ్ సిన్హా

పరవాడ: సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నిబంధనలకు అనుగుణంగా పర్యావరణ పరిరక్షణకు సింహాద్రి ఎన్టీపీసీ కృషి చేస్తోందని ఆ సంస్థ ప్రాజెక్టు హెడ్ సంజయ్‌కుమార్ సిన్హా తెలిపారు. పరవాడ ఎకోనా హోటల్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిర్వాసిత గ్రామాల నిరుద్యోగ యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సీఎస్సార్ విభాగం ద్వారా ప్లాస్టిక్ టెక్నాలజీలో 30 మంది నిరుద్యోగ యువతకు మూడు నెలల పాటు శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. ప్రజా ప్రతినిధుల విజ్ఞప్తి మేరకు నిర్వాసిత గ్రామాల్లో తాగునీరు, సీసీ రహదారులు, విద్య, ప్రజారోగ్యం, మహిళల అభ్యున్నతికి ఎనలేని కృషి చేస్తున్నామన్నారు. పరవాడ ప్రాంతంలో మొబైల్ వైద్యాలయాలను ఏర్పాటు చేసి ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు, మందులు అందజేస్తున్నామని చెప్పారు. డీఎల్‌సీ ద్వారా మహిళలకు కుట్టు మిషన్, బ్యూటీషియన్ విభాగాల్లో శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ సమావేశంలో సంస్థ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల జీవితాల్లో వెలుగులే లక్ష్యం

- కేంద్ర మంత్రి పర్షోత్తమ్
- 1589 మందికి ఉపకరణాల పంపిణీ



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కేంద్ర మంత్రి పర్షోత్తమ్ రుపాల

తాటిచెట్లపాలెం: దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవిశ్రాంత కృషి చేస్తున్నాయని కేంద్ర మత్స్య, పశుసంవర్థక, పాడి పరిశ్రమల శాఖ మంత్రి పర్షోత్తమ్ రూపాల అన్నారు. అసిస్టెన్స్ టు డిజేబుల్స్ పర్సన్స్ ఫర్ పర్చేజ్ ఫిట్టింగ్ ఆఫ్ ఎయిడ్స్/అప్లయన్స్) పథకం కింద గురువారం నగరంలోని కైలాసపురం సమీప డీఎల్‌బీ గ్రౌండ్స్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో సామాజిక అధికారత శిబిర్ పేరిట దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని 1589 మంది దివ్యాంగులకు సుమారు రూ.2.25 కోట్లతో అలింకో సంస్థ తయారు చేసిన 2925 పరికరాలను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రధాని మోదీ సున్నిత మనస్తత్వం కారణంగా దివ్యాంగులకు ఇంత మంచి జరుగుతుందన్నారు. రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు మాట్లాడుతూ దివ్యాంగులతో గౌరవ మర్యాదలతో మెలగాని సూచించారు. విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఎండీ కుమార్‌రాజు మాట్లాడుతూ దివ్యాంగుల కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక మంచి నిర్ణయాలు తీసుకుందని, దీనిలో భాగంగానే రూ.25 కోట్లతో 4 వేల మందికి ఉపకరణాలు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. ల్యాప్‌టాప్‌లు, మోటరైజ్డ్ త్రిచక్ర వాహనాలు అందజేస్తున్నామన్నారు. గుంటూరులో ఉన్న బ్రెయిలీ ప్రింటింగ్ కేంద్ర సహాయంతో అంధ విద్యార్థులకు బ్రెయిలీ పాఠ్య పుస్తకాలు అందిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో జేసీ మయూర్ అశోక్, అలింకో సంస్థ డిప్యూటీ జనరల్ మేనేజర్ సంజయ్ సింగ్, విభిన్న ప్రతిభావంతుల శాఖ విశాఖపట్నం జిల్లా ఏడీ మాధవి, విజయనగరం జిల్లా ఏడీ జగదీష్, అధికారులు, పలువురు ప్రజా ప్రతినిధులు, అధిక సంఖ్యలో దివ్యాంగులు పాల్గొన్నారు.

త్వరలో యాదవ సామాజిక భవనానికి శంకుస్థాపన



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేత గొలగాని శ్రీనివాసరావు

విశాఖ సిటీ: యాదవ సామాజిక భవన నిర్మాణానికి త్వరలోనే శంకుస్థాపన చేయనున్నట్టు వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత గొలగాని శ్రీనివాసరావు తెలిపారు. మేయర్ గొలగాని హరివెంకటకుమారి సూచనల మేరకు భవన నిర్మాణ శంకుస్థాపన ఏర్పాట్లు, తేదీ ఖరారుపై గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం యాదవుల సంక్షేమానికి పెద్ద పీట వేసిందన్నారు. యాదవ సామాజిక భవనానికి అర ఎకరం స్థలాన్ని కేటాయించినట్లు తెలిపారు. ఈ భవన నిర్మాణానికి వైఎస్సార్ సీపీ ప్రాంతీయ సమన్వయకర్త వై.వి. సుబ్బారెడ్డి, మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ చేతుల మీదుగా శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో పార్టీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త ఉరుకూటి చందు, విశాఖ తూర్పు నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు మొల్లి అప్పారావు, కార్పొరేటర్లు లొడగల అప్పారావు, అక్కరమాని రోహిణి, ఏపీ పోలీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పీతల గోవింద్, నాయకులు సురేష్, దుర్గ, తదితరులు పాల్గొన్నారు.

'వయోశ్రీ యోజన'తో వయోవృద్ధులకు చేయూత

మహారాణిపేట: రాష్ట్రీయ వయోశ్రీ యోజన పథకం ద్వారా వయోవృద్ధుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్ర మత్స్య, పశుసంవర్థక, పాడి పరిశ్రమల శాఖ మంత్రి పర్షోత్తమ్ రూపాల తెలిపారు. గురువారం నగరంలోని గ్రాండ్ బే హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నర్సింహారావుతో కలిసి ఆయన మాట్లాడారు. బీపీఎల్ పరిధిలోకి వచ్చే వయోవృద్ధుల ఆరోగ్యానికి ఈ పథకం ఎంతగానో దోహదపడుతుందన్నారు. ముందుగా ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి అర్హులైన సీనియర్ సిటిజన్లను గుర్తిస్తామన్నారు. వారి అవసరాల మేరకు కళ్లద్దాలు, వీల్ చైర్స్, వినికిడి మిషన్లు, కృత్రిమ దంతాలు, ట్రైపాడ్, ఊతకర్ర తదితర పరికరాలను ఆర్టిఫిషియల్ లింబ్స్ మాన్యుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(అలింకో) సంస్థ ద్వారా అందజేస్తామన్నారు. 60 సంవత్సరాలపై బడిన, నెలకు రూ.15వేలు మించకుండా ఆదాయం కలిగిన వయోవృద్ధులు అర్హులన్నారు. ముందుగా రాష్ట్రీయ వయోశ్రీ యోజన పథకం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. విభిన్న ప్రతిభావంతుల శాఖ ఎండీ కుమార్ రాజా, శాఖ విశాఖపట్నం సహాయ సంచాలకురాలు మాధవి, విజయనగరం సహాయ సంచాలకులు జగదీష్, సీనియర్ సిటిజన్ల సంఘం ప్రతినిధులు వెంకటరావు, మంగపతి పాల్గొన్నారు. అనంతరం సీనియర్ సిటిజన్లతో కేంద్ర మంత్రి ముచ్చటించారు.

హెచ్‌పీసీఎల్ స్క్రాప్ చోరీ నిందితులకు రిమాండ్

- రూ.77 లక్షల నగదు రికవరీ
- కేసు వివరాలు వెల్లడించిన డీసీపీ మోకా సత్తిబాబు

మల్కాపురం: హెచ్‌పీసీఎల్(విశాఖ రిఫైనరీ)లో విలువైన ఎక్స్ఛేంజ్ ట్యూబ్ స్క్రాప్ చోరీకి పాల్పడిన నిందితులను గురువారం రిమాండ్‌కు తరలించారు. అలాగే వారి వద్ద నుంచి మల్కాపురం పోలీసులు రూ.77 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను మల్కాపురం స్టేషన్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో డీసీపీ మోకా సత్తిబాబు తెలియజేశారు. హెచ్‌పీసీఎల్‌లో పని చేస్తున్న సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ పిల్లి శివకుమార్ గత నెల 29న విలువైన ఎక్స్ఛేంజ్ ట్యూబ్ స్క్రాప్‌ను దొంగలించి సొమ్ము చేసుకోవాలని ప్లాన్ వేశాడు. తన ఆలోచనను లోకేష్, డి.వాయునందన్‌రెడ్డి, పెంటారావు, క్రేన్ ఆపరేటర్ యశ్వంత్‌కుమార్, లారీ డ్రైవర్ జితేంద్రతో పంచుకున్నాడు. అలా అందరూ కలిసి దొంగతనం చేయాలని ప్రణాళిక రూపొందించుకున్నారు. ఇందు కోసం నకిలీ ఎంట్రీ పాస్‌లను కానిస్టేబుల్ శివకుమార్ సృష్టించాడు. అలా అందరూ సంస్థలోకి లారీతో సహా లోపలికి గత నెల 29న వెళ్లారు. స్క్రాప్‌ను బయటకు తీసుకువచ్చి, శ్యామ్‌చైత్ర అగర్వాల్ సహాయంతో హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి ద్వారా ముంబయిలో ఉంటున్న గులాం రసూల్ అనే వ్యక్తికి రూ.83 లక్షలకు విక్రయించినట్టు డీసీపీ తెలిపారు. దీనిపై హెచ్‌పీసీఎల్ సంస్థ మేనేజర్ ధీర్‌వీర్ విక్రమ్ ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేసి, ఈ దొంగతనానికి పాల్పడిన నిందితులను అదుపులోకి తీసుకుని విచారించామన్నారు. మరిన్ని వివరాలు సేకరించి, రూ.77,13,000 నగదు స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించామన్నారు. ఈ సమావేశంలో ఏసీపీ మోజెస్‌పాల్, మల్కాపురం సీఐ సన్యాసినాయుడు, ఎస్ఐ దేవుడమ్మ, తదితరులు పాల్గొన్నారు.

యలమంచిలిలో నివాసం : నాగబాబు

గోపాలపట్నం: అనకాపల్లి జిల్లా యలమంచిలిలో నివాసం ఏర్పర్చుకుంటున్నాని జనసేన నేత నాగేంద్రబాబు అన్నారు. యలమంచిలి వెళ్లేందుకు హైదరాబాద్ నుంచి విశాఖకు చేరుకున్నారు. ఈ సందర్భంగా విమానాశ్రయంలో మీడియాతో మాట్లాడారు. ఆంధ్రాలో జనసేన కోసం పని చేసే నేపథ్యంలో ఇక నుంచి యలమంచిలిలో అందుబాటులో ఉంటానన్నారు. అనకాపల్లి ఎంపీగా పోటీ చేసే అంశంపై పార్టీ నిర్ణయం తీసుకోలేదన్నారు.

ఈకోర్స్టా ఫుట్‌బాల్ జట్టుకు అభినందన

విశాఖ స్పోర్ట్స్: బిస్సం కటక్‌లో జరిగిన నెహ్రూ యూత్ క్లబ్ ఫుట్‌బాల్ టోర్నీ విజేతగా నిలిచిన ఈకోర్స్టా ఫుట్‌బాల్ జట్టును డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ అభినందించారు. బీ పూల్‌లో ఆడిన ఈకోర్స్టా జట్టు ఫైనల్‌లో 5–0 గోల్స్ తేడాతో హనుమాన్–11 జట్టుపై విజయం సాధించింది. ఈ సందర్భంగా డీఆర్ఎం మాట్లాడుతూ క్రీడాకారులు చక్కటి ప్రదర్శన కనబరిచారన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్ఎం మనోజ్‌కుమార్, ఎస్‌డీఈ ఎ.కె.మహారాణి, తదితరులు పాల్గొన్నారు.



జట్టు సభ్యులతో డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్

రూ.1500 కోట్లతో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి

- ఏపీఈడబ్ల్యూఐడీసీ ఛైర్మన్ యనమల నాగార్జున
- చంద్రంపాలెంలో నాడు–నేడు పనుల పరిశీలన



చంద్రంపాలెం హైస్కూల్లో విద్యార్థినులతో మాట్లాడుతున్న నాగర్జున యాదవ్

మధురవాడ: రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను ప్రపంచ స్థాయిలో రాణించేలా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని ఏపీ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ యనమల నాగార్జున యాదవ్ చెప్పారు. రాష్ట్ర వ్యాప్త పర్యటనలో భాగంగా గురువారం చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులను ఆయన ఇంజినీరింగ్ శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. అదనపు తరగతి భవనాలు, ఆర్‌వో ప్లాంట్, మరుగుదొడ్ల నిర్మాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రూ.1500 కోట్లతో 17,738 పాఠశాలలను నాడు–నేడు కింద అభివృద్ధి చేశామన్నారు. చంద్రంపాలెం పాఠశాలలో రెండు దశల్లో రూ.2.5 కోట్లతో అభివృద్ధి, సుందరీకరణ పనులు జరుగుతున్నాయని చెప్పారు. పాఠశాల మైదానంలో నిలిచిపోతున్న వర్షపు నీరు బయటకు పంపించే ప్రయత్నాలు కొంతమేర చేపట్టామన్నారు. నాడు–నేడు రెండో దశ పనులు పూర్తయిన వెంటనే మిగతా పనులు చేపడతామని తెలిపారు. విశాఖ జిల్లాలో ఉన్న 8 మండలాల్లో 474 పాఠశాలలను రూ.175 కోట్లతో ఆధునికీకరించామన్నారు. విద్యార్థులకు ట్యాబ్‌లు అందించడంతో పాటు, పాఠశాలల్లో ఐఎఫ్‌బీ ప్యానల్స్ ద్వారా డిజిటల్ విద్య సదుపాయం కల్పించామన్నారు. మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా వస్తారని, మరింత అభివృద్ధి చేయడం సాధ్యం అవుతుందని నాగార్జున తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులతో బోధనపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఈఈ ఎ.రమేష్, సత్యనారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.రాజబాబు, పాఠశాల కమిటీ ప్రతినిధి పిళ్లా సూరిబాబు పాల్గొన్నారు.